

మట్టి.. మొరం.. ఇసుక దందా!
వర్ధన్నపేటలో అక్రమ రవాణా జోరు?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -142 బుధవారం 11 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

తెలంగాణలో పెరిగిన
చలి తీవ్రత..

29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తీవ్ర చలిగాలులు

కొన్ని జిల్లాల్లో 12 డిగ్రీల వరకు పడిపోనున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ఈశాన్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులే ఉష్ణోగ్రతల పతనానికి కారణం



హైదరాబాద్:నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత **మిగతా 2లో...**



ప్రజల కోసం అధికారాన్ని వినియోగించాలి..

పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడాలి

బాధితుల సమస్యలను సానుభూతితో పరిష్కరించాలి


ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన

హైదరాబాద్:నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): సమాజంలో పోలీస్ వ్యవస్థకు ఉన్న విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు లభించిన అధికారాన్ని ప్రజల సంక్షేమం, రక్షణ కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



ప్రధాని పదవిని నిరాకరించా!

'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట రాసిన తన ఆత్మకథలో సోనియాగాంధీ



పార్టీ నేతల ఒత్తిడితో అంగీకరించినా..

రాహుల్, ప్రియాంక వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గా

మన్మోహన్ సింగ్ చేతుల్లో దేశం సురక్షితమని నమ్మా..

అందుకే ఆయన పేరును ప్రతిపాదించా

మోదీతో వ్యక్తిగత విభేదాలు లేవు..

దేశం పట్ల మా ఆలోచనలు వేరు

రెండుసార్లు క్యాన్సర్‌తో పోరాడా..

ఇందిర, రాజీవ్‌లతో అనుబంధాలు, కుటుంబంలోని విభేదాలపై ఆత్మకథలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తన జీవితంలోని అనేక కీలక సంఘటనలు, రాజకీయ పరిణామాలు, కుటుంబ అనుబంధాలు, వ్యక్తిగత అనుభవాలను తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో వెల్లడించారు. 2004లో కాంగ్రెస్ విజయం సాధించిన అనంతరం ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు తొలుత తాను నిరాకరించానని, పార్టీ నాయకులు**మిగతా 2లో...**

ఏపీ వెబ్‌ల్యాండ్ పోర్టల్ హ్యాకింగ్.. నలుగురి అరెస్ట్



సీనియర్ ఎన్ఐసీ అధికారి యూజర్ ఐడీని దుర్వినియోగం చేసిన నిందితులు

నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, డిజిటల్ లావాదేవీల పత్రాలు స్వాధీనం

డబ్బులు తీసుకుని అక్రమంగా పట్టాదార్ పేర్లు మార్చినట్లు సీఐడీ గుర్తింపు


అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్‌లో భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థ అయిన 'వెబ్‌ల్యాండ్' పోర్టల్‌లో అక్రమ మార్పులకు పాల్పడిన ముఠా గుట్టును సీఐడీ అధికారులు రట్టు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ రికార్డులను తారుమారు చేసి, నకిలీ పట్టాదారుల పేర్లను చేర్చిన వ్యవహారంలో నలుగురు నిందితులను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. **మిగతా 2లో...**

అది ఆత్మకథ కాదు 'వైట్‌వాషింగ్'

సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'పై బీజేపీ తీవ్ర విమర్శలు

గాంధీ కుటుంబ చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నమే ఈ పుస్తకమని ఆరోపణ

ఎమర్జెన్సీని పారపాటుగా చెప్పి దాన్ని సాధారణీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శ



న్యూఢిల్లీ, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'పై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ పుస్తకం నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక **మిగతా 2లో...**

కరీంనగర్‌కు నితిన్ నబీన్..

లక్ష మందితో బీజేపీ మహా పాదయాత్ర

ఈ నెల 18న కరీంనగర్‌కు నితిన్ నబీన్ రాక

లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ ఏర్పాట్లు

బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ

హైదరాబాద్:నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు



ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి



నిజానిజాలను నిగ్గు తేల్చాలి

కుట్రదారులను బయట పెట్టాలి

డీజీపీకి వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య లేఖ

అల్దాస్ జానయ్యను బర్తరఫ్ చేయాలి

మాజీ మంత్రులు సబిత, సునీత, సత్యవతి డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): (తనపై వస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (వీసీ) ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు లేఖ రాశారు. ఈ విషయాన్ని వర్సిటీ ప్రజా సంబంధాల అధికారి మీడియాకు వెల్లడించారు.

పెరిగిన పోస్టులు

ఏపీలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల

గతంలో ప్రకటించిన 686 పోస్టులను 720కి పైగా పెంచిన ఏపీపీఎస్సీ

డిసెంబర్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

2027 ఫిబ్రవరి 21న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ

ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకునే అవకాశం

APPSC

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ **మిగతా 2లో...**

విశాఖలో రేపటినుంచి సీఐఐ సమ్మిట్

సదస్సును ప్రారంభించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హాజరుకానున్న విదేశీ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు

కేంద్ర మంత్రులు, సీఈవోలతో సీఎం చంద్రబాబు భేటీలు

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న స్పేస్ స్టార్టప్‌లు

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్2026 కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరోజు ముందుగానే విశాఖకు చేరుకుంటున్నారు. నవంబర్ 12, 13వ తేదీల్లో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు ప్రారంభానికి ముందే అంతర్జాతీయ ప్రతినిధులు, **మిగతా 2లో...**



అంతర్జాతం ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

కరీంనగర్‌కు నితిన్ నబీన్..

సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు.

గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు.

పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

హైదరాబాద్:నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

అది ఆత్మకథ కాదు 'వైట్‌వాషింగ్'

మొదటిపేజీ తరువాయి

తప్పిదాలను కప్పిపుచ్చి, వారి పాపాలను శుభ్రపరిచే ఒక 'వైట్‌వాషింగ్' ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. తాజాగా ఈ పుస్తకం విడుదలైన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటని, చివరికి ఆమె కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఇందిర తన చిన్న కుమారుడు సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, జరిగిన నష్టంలో చాలా వరకు నివారించి ఉండేవారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలను కేశవన్ తోసిపుచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలను అంగీకరించకుండా, దాన్ని ఒక సాధారణ పొరపాటుగా చిత్రీకరించి, సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.పుస్తకంలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన గురించి ప్రస్తావిస్తూ తాను ఏడ్చానని సోనియా చెప్పడాన్ని కేశవన్ తప్పుబట్టారు. "బాబ్రీ మసీదు కోసం కన్నీళ్లు పెట్టుకున్న సోనియా గాంధీ, కాంగ్రెస్ హయాంలో 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో వేలాది మంది అమాయకులు చనిపోయినప్పుడు కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా?" అని ఆయన ప్రశ్నించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి గురించి ఎప్పుడైనా బాధపడ్డారా అని నిలదీశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ ఆత్మకథ విడుదలకు ముందు జరిగిన పరిణామాలను కూడా కేశవన్ గుర్తుచేశారు. "2014లో నట్వర్ సింగ్ తన ఆత్మకథ 'వన్ లైఫ్ ఈజ్ నాట్ ఎనఫ్' విడుదలకు ముందు సోనియా గాంధీ ఆయన్ను ఎందుకు కలిశారు? 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జరిగిన పరిణామాల గురించి నట్వర్ సింగ్ ఏం రాస్తారోనన్న భయంతోనే ఆయన్ను కలిశారా? ఈ విషయాలపై తన పుస్తకంలో సోనియా స్పష్టత ఇస్తారా?" అని కేశవన్ ప్రశ్నల వర్షం కురిపించారు.దాదాపు 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలిగించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి

సాధారణ పరిపాలన బదిలీలపై కక్షగట్టి తనపై నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బదిలీల ముసుగులో అసత్య ప్రచారానికి తెరలేపారన్నారు. 11 నెలల పాటు మౌనంగా ఉండి, ఇప్పుడు బురద జల్లే యత్నం వెనుక అసలు కుట్రదారులు ఎవరో సమగ్ర విచారణ ద్వారా తేల్చాలని కోరారు.

సదరు అధ్యాపకురాలికి, తనకు మధ్య జరిగిన వాట్సాప్ చాట్లు, కాల్ హిస్టరీలు తదితర డిజిటల్ ఆధారాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీని 2047 నాటికి అత్యత్తమంగా తీర్చిదిద్దడం, రైతాంగానికి ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కాగా, వీసీ అల్దాస్ జానయ్యను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. వీసీ లైంగిక వేధింపులపై బాధిత ప్రొఫెసర్ ఉమెన్స్ సేఫ్టీ డీజీకి, రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని.. వర్సిటీ చాన్స్‌లర్ అయిన గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. తనకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ



ఆవరణలో.. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులతో కలసి నిరసన తెలుపుతున్న బాధిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీని మంగళవారం కలసి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. తేజశ్రీ ఫిర్యాదు ఆధారంగా వీసీ జానయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని బాధిత ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలన్నారు.

ఆరోపణల వెనుక కుట్ర: జాజుల శ్రీనివాస్ గౌడ్

వ్యవసాయ వర్సిటీకి తొలిసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వీసీగా బాధ్యతలు చేపట్టడాన్ని ఓర్వలేక కొందరు తెరవెనుక కుట్రలు పన్నుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బీసీ సంఘాల నాయకులతో కలసి హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ప్రధాన రాజకీయ పార్టీ అండతోనే ఈ కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

జానయ్యపై పోలీసులకు ఫిర్యాదు

తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యపై అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీ మంగళవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ (ముట్టినట్టు రసీదు) ఇవ్వాలని ఆమె పోలీసులను కోరగా.. బుధవారం ఉదయం ఇస్తామని చెప్పారు. దానికి ఒప్పుకోని తేజశ్రీ పోలీవీసస్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ఆమెకు మద్దతుగా వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సంఘీభావం తెలిపారు.

పెరిగిన పోస్టులు

మొదటిపేజీ తరువాయి

పోస్టులు, 249 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి.

ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.

విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (ఖూ), చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ (ఏవీ=) పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం.అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, పే-స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (psc.ap.gov.in) లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజల కోసం అధికారాన్ని వినియోగించాలి..

మొదటిపేజీ తరువాయి

మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. క్రైమ్‌సీన్స్ ఫోరెన్సిక్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా పనిచేయడం, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయడం వల్లే ప్రజల్లో పోలీస్ వ్యవస్థకు గుర్తింపు లభించిందన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కొత్తగా బాధ్యతలు చేపట్టే డీఎస్పీలపై ఉందన్నారు. ప్రజల సమస్యలను ఓపికగా వినాలని, బాధితులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి ఇబ్బందులను అర్థం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. పోలీస్ శాఖలో చేరిన ఉద్దేశాన్ని ఎప్పటికప్పుడు



గుర్తుంచుకోవాలని, వ్యక్తిగత నేపథ్యాన్ని మరిచిపోకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. 112 మంది డీఎస్పీల నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించినట్టు వివరించారు. పోటీ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకొచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.మారుతున్న నేరాల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సీఎం సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైతే నూతన డీఎస్పీలను విదేశాలకు అధ్యయన పర్యటనకు పంపిస్తామని వెల్లడించారు.పోలీస్ అధికారులు తమ శారీరక దారుఢ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాబోయే మూడు దశాబ్దాల తెలంగాణ భవిష్యత్తు నిర్మాణంలో పోలీస్ అధికారుల పాత్ర కీలకమని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు శివధర్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, శాంతకుమారి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ వెబ్‌ల్యాండ్ పోర్టల్ హ్యాకింగ్.. నలుగురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దొనకొండ మండలంలోని ఇండ్లచెరువు, పడమర లక్ష్మీపురం గ్రామాల్లోని సుమారు 6.55 ఎకరాల భూమికి సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో అనధికారికంగా మార్పులు జరిగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎటువంటి అధికారిక మ్యుటేషన్ ప్రొసీడింగ్స్ జారీ కాకపోయినప్పటికీ, ఆన్‌లైన్ రికార్డులలో కొత్త పట్టాదారుల పేర్లు ప్రత్యక్షమయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు లోతుగా పరిశీలించగా భారీ గోల్‌మాల్ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది.దర్యాప్తు చేపట్టిన సీఐడీ అధికారులు నిందితుల అక్రమాలను గుర్తించారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (చీ×జ) కు చెందిన ఒక ఉన్నతాధికారి యూజర్ ఐడీని నిందితులు దుర్వినియోగం చేసినట్లు తేలింది. కంప్యూటర్ హ్యాకింగ్, అనధికారికంగా డేటాను డౌన్‌లోడ్ చేయడం, వైరస్ లేదా మాల్వేర్ ప్రవేశపెట్టడం, నెట్‌వర్క్ వ్యవస్థకు అంతరాయం కలిగించడం, రికార్డుల ఫోర్జరీ, మోసం వంటి తీవ్రమైన చర్యలకు పాల్పడినట్లు తేలడంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన వడ్లమూడి ఏడుకొండలు, సాయికుమార్, వేముల వెంకట్రావు, షేక్ బాషా అనే నలుగురు వ్యక్తులను సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, డిజిటల్ లావాదేవీల వివరాలతో పాటు అడంగల్ భూ వివరాలు ఉన్న పవర్‌పాయింట్ ప్రజంటేషన్లను స్వాధీనం చేసుకున్నారు. వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా పేర్లు మార్చేందుకు నిందితులు పలువురి వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం కూడా ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

ప్రధాని పదవిని నిరాకరించా!

మొదటిపేజీ తరువాయి

ఒత్తిడితో అంగీకరించినప్పటికీ పిల్లలు రాహుల్, ప్రియాంకల అభ్యంతరాలతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నానని తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉంటుందనే విశ్వాసంతోనే ఆయన పేరును ప్రధాని పదవికి ప్రతిపాదించినట్లు వివరించారు.

మోదీతో భిన్నమైన భావజాలం

ప్రధాని నరేంద్రమోదీతో తనకు వ్యక్తిగత విభేదాలు లేవని, దేశం పట్ల తమ ఆలోచనా విధానాలు భిన్నంగా ఉన్నాయని సోనియా పేర్కొన్నారు. భారతదేశం అంటే భిన్న జాతులు, సంస్కృతులు, భాషలు, మతాల సమ్మేళనమని, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం దాని పునాదులని వివరించారు. మోదీ భారతదేశ భావన ఆరెస్సెస్ సిద్ధాంతాల ప్రభావంతో రూపుదిద్దుకుందని, ఒక మతం, సంస్కృతికి ప్రాధాన్యమిచ్చే విధంగా ఉందని విమర్శించారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అధికారిక సమావేశాల్లో మాత్రమే కలిశామని, వ్యక్తిగతంగా పెద్దగా సంభాషణ జరగలేదని తెలిపారు. ఎదురుపడినప్పుడు నమస్కారం చేసుకోవడం మినహా ప్రత్యేకంగా మాట్లాడుకునే సందర్భాలు లేవన్నారు.

ప్రణబ్ ఆకాంక్షపై ప్రస్తావన

2010లో అప్పటి కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరంతో విభేదాల నేపథ్యంలో ప్రణబ్ ముఖర్జీ తన అసహనాన్ని వ్యక్తం చేశారని సోనియా వెల్లడించారు. ప్రభుత్వ నాయకత్వాన్ని మార్చాల్సిన సమయం ఆసన్నమైందేమోనని ఆయన వ్యాఖ్యానించారని, దానిని ప్రధాని పదవిపై ఆయనకున్న ఆకాంక్షగా భావించినట్లు పేర్కొన్నారు. అయితే, ఆ సమయంలో తాను సంభాషణను మరోవైపు మళ్లించానన్నారు. మరోవైపు, మాజీ రాష్ట్రపతి పీవీ



నరసింహారావుతో తనకు శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. రాజీవ్‌గాంధీ హత్య కేసు దర్యాప్తు మందకొడిగా సాగడంపై మాత్రమే తాను అసంతృప్తి వ్యక్తం చేశానని వివరించారు.

ప్రధాని పదవికి దూరంగా.. మన్మోహన్‌కు అవకాశం

2004 ఎన్నికలకు ముందే కాంగ్రెస్ విజయం సాధిస్తే తాను ప్రధానమంత్రి పదవిని స్వీకరించబోనని పిల్లలకు స్పష్టంగా చెప్పినట్లు సోనియా తెలిపారు. రాహుల్, ప్రియాంక కూడా తాను ప్రధాని కావాలని కోరుకోలేదన్నారు. పార్టీ నాయకుల ఒత్తిడితో అంగీకరించినప్పటికీ పిల్లలు ఆందోళన చెందడంతో వెనక్కి తగ్గినట్లు వివరించారు. మన్మోహన్ సింగ్ చేతుల్లో దేశం సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతోనే ఆయన పేరును ప్రతిపాదించానని తెలిపారు. యూపీఏ ప్రభుత్వాన్ని తానే వెనుక నుంచి నడిపించానన్న విమర్శలను ఖండించారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్, పార్టీ అధ్యక్షురాలిగా తాను వ్యవహరించామని, ఇద్దరి మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఉండేదని పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ.. సిక్కులపై అల్లర్లపై వ్యాఖ్యలు

1984లో ఆపరేషన్ బ్లూస్టార్ అనంతరం స్వర్ణదేవాలయంలో జరిగిన పరిణామాలు ఇందిరాగాంధీని తీవ్రంగా కలచివేశాయని సోనియా వెల్లడించారు. ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లను దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన, సిగ్గుచేటైన అధ్యాయంగా అభివర్ణించారు. రాజీవ్‌గాంధీ మనసులో సిక్కులపై ద్వేషం లేదని, అల్లర్లను ఆయన సమర్థించలేదని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో అధికారిక హోదా లేకపోయినా సంజయ్‌గాంధీ కీలక నిర్ణయాల్లో ప్రభావం చూపారని పేర్కొన్నారు. ఆయన దూకుడు వైఖరి ఇందిరాగాంధీపై మానసిక ఒత్తిడిని పెంచిందన్నారు.

రెండుసార్లు క్యాన్సర్‌తో పోరాటం

తన ఆరోగ్య పరిస్థితుల గురించి కూడా సోనియా ఆత్మకథలో ప్రస్తావించారు. 2010లో రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యానని, అదే ఏడాది శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఏడాది తర్వాత క్లోమ క్యాన్సర్ ఉన్నట్లు తెలియడంతో తాను, పిల్లలు దిగ్భ్రాంతికి గురయ్యామని వెల్లడించారు. వ్యాధి నుంచి బయటపడగలనా అనే భయం వెంటాడిందన్నారు. రెండోసారి శస్త్రచికిత్స గురించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు కొద్దిమంది ప్రభుత్వ పెద్దలకు మాత్రమే తెలుసని వివరించారు.

తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత..

మొదటిపేజీ తరువాయి

మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

వాతావరణ శాఖ వివరాల ప్రకారం... జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని, అక్కడ ఉష్ణోగ్రతలు దాదాపు 12 డిగ్రీల వరకు పడిపోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలోని నేరెడుగొండలో అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డైంది.దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న చల్లని గాలుల ప్రభావం వల్లే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ మూడు రోజుల పాటు తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకునే అవకాశముంది. దీనివల్ల దృశ్యమానత (విజిబిలిటీ) తగ్గి రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, అటవీ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఉదయం వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విశాఖలో రేపటినుంచి సీఐఐ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

వివిధ దేశాల మంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. పెట్టుబడుల సమీకరణలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, రాష్ట్రంలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామిక విధానాలను అంతర్జాతీయ వేదికపై బలంగా వినిపించేందుకు ముఖ్యమంత్రి ముందస్తుగానే రంగంలోకి దిగుతున్నారు.ముఖ్యమంత్రి తన షెడ్యూల్‌లో భాగంగా బుధవారం ఉదయం అమరావతిలో సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో సమావేశమవుతారు. అనంతరం నేరుగా విశాఖపట్నం చేరుకుని వరుస భేటీల్లో పాల్గొంటారు. ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీవో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీలతో పాటు రెన్యూ పవర్ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాతో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. బుధవారం సాయంత్రం పలు బహుళజాతి సంస్థల సీఈవోలతో భేటీ అయ్యాక, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్వాగత విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు.విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో నవంబర్ 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ 31వ భాగస్వామ్య సదస్సును అధికారికంగా ప్రారంభించనున్నారు. గతంలో నిర్వహించిన సదస్సులకు భిన్నంగా ఈసారి సదస్సు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా సుమారు రూ.86 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, ఈ ప్రధాన సమ్మిట్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన వెస్ట్‌జోన్ డీసీపీ

రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది క్రమశిక్షణపై సమీక్ష







వర్ధన్నపేట/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌ను వెస్ట్‌జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఐపీఎస్ వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది కిట్, విధుల నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్‌స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు విధానం, సిబ్బంది పనితీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది వ్యవహరించే తీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై కూడా సమీక్షించారు. ఫిర్యాదులను ప్రాధాన్యతతో స్వీకరించి, చట్టపరిధిలో వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ ప్రధాన ఉద్దేశం స్టేషన్ పనితీరును సమీక్షించడం, సిబ్బందికి అవసరమైన సూచనలు అందించడం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందేలా చూడటమేనని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది



సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.
ఈ తనిఖీలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ,ఎస్సై ప్రవీణ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమికి అక్రమ పట్టాలా?

మా భూమిని మాకు దక్కేలా న్యాయం చేయండి.. బాధితుల ఆవేదన

ఎల్కతుర్తి (జర్నలిస్టు వార్త):
భూమిని నమ్ముకుని నాలుగు దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న తమకు తెలియకుండా ఇతరుల పేర్లపై పట్టాలు నమోదు చేశారని భావుపేట గ్రామానికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూమిని తమకు దక్కేలా న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 115లో ఉన్న 6 ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమి దండేపల్లి గ్రామానికి చెందిన సీతారామ, అండాలమ్మకు సంబంధించినదని బాధితులు పేర్కొంటున్నారు. గత 40 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు



తెలిపారు.పట్టాల నమోదు సమయంలో సంబంధిత పత్రాలు, వారసత్వ హక్కులు, భూమి రికార్డులను పరిశీలించారా?వివాదాస్పద భూమిపై పట్టాల నమోదు జరిగితే దానికి సంబంధించిన ఆధారాలేమిటి?
ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి అసలు హక్కుదారులను గుర్తించాలని బాధితులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, పాత రికార్డులు, పట్టాదారు పత్రాలు, సాగు వివరాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమంగా రికార్డుల మార్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
నాలుగు దశాబ్దాల భూ అనుభవం ఒకవైపు.. కొత్త పట్టాల వివాదం మరోవైపు.. అసలు భూమి హక్కుదారులెవరో రెవెన్యూ యంత్రాంగం తేల్చి బాధితులకు న్యాయం చేస్తుందా? ఎల్కతుర్తి తహసీల్దార్ స్పందించి సమగ్ర విచారణ చేపడతారా? వేచి చూడాలి మరి.

క్వింటాల్ ధాన్యానికి రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలి





మిర్యాలగూడ/ నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
రైతులకు నష్టం కలగకుండా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) రైస్‌మిల్లర్లకు సూచించారు. ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతుల నుంచి ఆందోళనలు వ్యక్తం కావడంతో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని కోరారు.అనంతరం రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మిల్లులో క్వింటాల్ ధాన్యాన్ని రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ధాన్యం నాణ్యతను బట్టి అంతకంటే ఎక్కువ ధర కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవతో రైతులకు ధర విషయంలో భరోసా లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా బోడా డిన్న..

ఘనంగా సత్కరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్







వరంగల్/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):ఎ
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన బోడా డిన్నకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అభినందనలు తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అయూబ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బోడా డిన్నను ఆయన శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అయూబ్ ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాషాపాక సదానందం, కొత్తపల్లి శ్రీనివాస్, మహమ్మద్ కమలుద్దీన్, ఎర్రం కమల్ తదితరులు పాల్గొని బోడా డిన్నను సత్కరించి అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జన్ను భిక్షపతి



వర్ధన్నపేట/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ డాక్టర్ జన్ను భిక్షపతి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జన్ను నర్సయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు జన్ను భిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

కడారిగూడెంలో మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

గ్రామ అధ్యక్షుడిగా కంజర్ల కృష్ణస్వామి



వర్ధన్నపేట/నవంబర్ 10 (జర్నలిస్టు వార్త): వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామంలో మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మండల మాదిగ ప్రజా సంఘం అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగ మాట్లాడుతూ ప్రతి మాదిగ విద్యార్థి చదువుతోపాటు సామాజిక చైతన్యం అలవర్చుకోవాలని, ఎస్సీ వర్గీకరణ ద్వారా సాధించిన ఫలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని విద్యా, విజ్ఞాన రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా కంజర్ల కృష్ణస్వామి మాదిగ, అధికార ప్రతినిధిగా హర్షవర్ధన్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కంజర్ల పవన్ మాదిగ, కంజర్ల మహేష్ మాదిగ, సీహెచ్ బబ్బులు మాదిగ, గాదె నితిన్ మాదిగ, గాదె మహేందర్ మాదిగ, కంజర్ల సుధాకర్ మాదిగ, చిన్న మధుకర్ మాదిగలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కడారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్న ఎల్లయ్య మాదిగ, వర్ధన్నపేట మండల ఉపాధ్యక్షుడు చెలివేరి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వెంకటగిరి అభివృద్ధికి కృషి చేస్తాం



తల్లాడ/నవంబర్ 1 (జర్నలిస్ట్ వార్త):తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ దయానంద్ విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన చల్లగుండ్ల నరసింహారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని దయానంద్ విజయకుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గోవింద్ శ్రీనివాసరావు, పడాల లచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణాచారి, కొలిపాక వెంకటరమయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కరువు రైతులకు తక్షణమే పరిహారం అందించాలి



హసన్‌పర్తి/నవంబర్ 10 (జర్నలిస్టు వార్త):కరువు మండలాల్లో ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాక్షిక కరువు మండలాలుగా కాకుండా పూర్తిస్థాయి కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్టపరిహారం అందించాలని, ఉపాధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక ఉపాధి కల్పించాలని కోరారు. కరువు పరిస్థితులపై ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేయించాలని సూచించారు.ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 11న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఎన్.ఎ. స్టాలిన్, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతం ప్రజల పత్రం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఎస్ఎఫ్ఐ కమలాపూర్ మండల కమిటీ ఎన్నిక



హసన్‌పర్తి/నవంబర్ 10 (జర్నలిస్టు వార్త):
హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ.. మండలంలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. 'చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు' అనే నినాదంతో విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలని అన్నారు.నూతన మండల అధ్యక్షుడిగా తేజ, ప్రధాన కార్యదర్శిగా చరణ్, ఉపాధ్యక్షుడిగా అఖిల్, సహాయ కార్యదర్శిగా రామ్ నరేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సాల్మన్ రాజ్, భాను ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కమిటీ ఎన్నిక



హసన్‌పర్తి/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల మీడియా పాయింట్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎర్రగట్టుగుట్ట కళ్యాణ మండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సందెల సాగర్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా కొప్పుల రాజేందర్, దాడి భిక్షపతి, సందెల రాజు, కోశాధికారిగా దాడి చిరంజీవి, సహాయ కోశాధికారిగా మండ రాజేష్, కార్యదర్శులుగా బొక్క రాజు, వాజిద్, సహాయ కార్యదర్శులుగా రామంచ మధుకర్, చెన్నూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.సలహాదారులుగా సయ్యద్ అహ్మద్, దండుగూడెం రాజకుమార్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మీడియా పాయింట్ సభ్యులు కే. కార్తీక్, బండారి సుమన్, పత్తిపాక విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యమకారుడి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది

జనగామ/ నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో లక్ష్మణ్‌గౌడ్ అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం కొన్నె గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఉద్యమకారుడు లక్ష్మణ్‌గౌడ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. లక్ష్మణ్‌గౌడ్ చిత్రపటానికి హరీశ్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. లక్ష్మణ్‌గౌడ్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల చదువుల బాధ్యతను బీఆర్ఎస్ తరఫున తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.లక్ష్మణ్‌గౌడ్ మృతికి దారితీసిన పరిస్థితులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారసత్వంగా సాగు చేస్తున్న వ్యవసాయ భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం, జేసీబీ విక్రయం, పంటలకు సాగునీరు అందకపోవడం వంటి సమస్యలతో ఆయన తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





సర్టిఫికెట్ రద్దయినా ఆగని వైద్యం..



ఎల్కతుర్తి/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేటలో శ్రీనివాస్ అనే ఆర్ఎంపీ వైద్యుడు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇంజక్షన్ వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో అతని వైద్య ధ్రువీకరణ పత్రాన్ని రద్దుచేసి, ఆస్పత్రిని అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. కొంతకాలం వైద్య సేవలు నిలిపివేసిన అనంతరం ప్రస్తుతం రహస్యంగా పరీక్షలు నిర్వహిస్తూ, ఇంజక్షన్లు వేస్తూ మందులు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో రోగి నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన నిజమైతే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపు



కేసముద్రం/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
ఆటలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈఓ కాలేరు యాదగిరి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యాదగిరి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత రామచంద్రన్, వార్డు సభ్యుడు పిచ్చయ్య, ఉపాధ్యాయులు మద్దినేని వీరబాబు, యాకయ్య, సోమయ్య, విజయకుమారి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు జోసఫ్‌కు పరామర్శ



తల్లాడ/ నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసఫ్ ప్రమాదవశాత్తు కాలు జారి కుడికాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మూడు ముంతల గంగరాజు, మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోడూరు రాము, యుగంధర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మరో అవకాశం

ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ



రాయపర్తి/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన పట్టభద్రులకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 25న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించనున్నట్లు రాయపర్తి తహసీల్దార్ ఎం. శ్రీనివాస్ తెలిపారు.ముసాయిదా జాబితా విడుదలైనప్పటి నుంచి డిసెంబర్ 10 వరకు ఓటరు నమోదుతో పాటు జాబితాలో తప్పులపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

12న పర్వతగిరి మండల సర్వసభ్య సమావేశం



పర్వతగిరి/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఈనెల 12న ఉదయం 10.30 గంటలకు పర్వతగిరి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామపంచాయతీ నిధులు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ సహా 30 అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వైరా ఎస్సైని కలిసిన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ



వైరా/ నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):వైరా పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆర్. ప్రవీణ్‌కుమార్‌ను వైరా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దేవబత్తిని సీతారాములు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, జూదం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను సహించబోమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ షాకీర్, ఉపాధ్యక్షులు వాకదాని శ్రీకాంత్, మామిళ్లపల్లి విజయ్, గొడ్ల నరసింహారావు, తుప్పతి రవికుమార్, సత్తెనపల్లి నరసింహారావు, నారపోగు ప్రసాద్‌బాబు, ఇస్సనాపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకంలో నాణ్యమైన వైద్య సేవలేవి?

1.5 శాతం వాటా చెల్లిస్తున్నా ప్రయోజనం లేదని ఉపాధ్యాయుల నిరసన



కేసముద్రం/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందించాలని టీపీటీఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షుడు గుండు సురేందర్ డిమాండ్ చేశారు. తమ మూలవేతనంలో 1.5 శాతం వాటా చెల్లిస్తున్నా అవసరమైన సమయంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందడం లేదని విమర్శించారు. ఆరోగ్య కార్డులను ఆసుపత్రులు అంగీకరించేలా, వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై కేసముద్రం విలేజ్, అర్పణపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కౌన్సిలర్ వీసం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, కార్యదర్శులు ఊట్కూరి ప్రణయ్ కుమార్, అప్పాల నాగరాజు, బి. శ్రీను, ఎం. నరసింహస్వామి, ఆర్. యాదగిరి, ఏ. రమాదేవి, టి.వి. బీజాయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

భార్యకు ఉద్యోగం కల్పిస్తాం. హరీశ్‌రావు



జనగామ/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పినట్లు తెలిపారు. కుటుంబానికి పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించామని, లక్ష్మణ్ గౌడ్ భార్యకు ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జేసీబీ సీజ్ కావడం, పంట నష్టాలు, అప్పుల భారం, భూమి నిషేధిత జాబితాలో చేరడం వంటి పరిణామాలు కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేశాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. భూమి సమస్యపై అధికారులు స్పందించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భూమిపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఉద్యమకారులు, కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతని స్పష్టం చేశారు.

హసన్‌పర్తిలో వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



హసన్‌పర్తి/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
హసన్‌పర్తికి చెందిన పోతరాజు స్వామి భార్య సరిత (43) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కిట్స్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్న ఆమె ఉద్యోగం మానేయాలని భర్త ఒత్తిడి చేయడంతో దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నవంబర్ 5న తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసినవారు 871685015 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎల్‌నినో ముప్పు పొంచి ఉంది..

సర్పంచుల బాధ్యత ఏమైంది?

నీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి.. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి: ఎంపీడీవో వెంకటరమణ

సమావేశాలకు సర్పంచుల గైర్హాజరు.. వచ్చినవారూ మధ్యలోనే వెళ్లిపోతే గ్రామ సమస్యలపై చర్చించేదెప్పుడు?



వర్ధన్నపేట/నవంబర్ 10(జర్నలిస్ట్ వార్త): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వరి, మొక్కజొన్నకు బదులుగా పెసర, కంది వంటి ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సర్పంచులకు సూచించారు. అయితే మండల సర్వసభ్య సమావేశానికి కొందరు సర్పంచులు గైర్హాజరు కావడం, హాజరైనవారిలోనూ కొందరు సమావేశం పూర్తికాకముందే వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సమావేశాలకు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరుకావాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామాల్లో నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, వ్యవసాయ పరిస్థితులపై ముందస్తు అంచనాలు రూపొందించుకోవాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు.

సమావేశాలకు హాజరు కాని ప్రజాప్రతినిధులు..

మండల సర్వసభ్య సమావేశానికి కొందరు సర్పంచులు హాజరుకాకపోగా, వచ్చినవారిలో కొందరు మధ్యలోనే వెళ్లిపోయారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, వ్యవసాయ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిన సమావేశాలకు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదికనే సద్వినియోగం చేసుకోకపోతే ప్రజలకు జవాబుదారీతనం ఎలా ఉంటుందన్న చర్చ సాగుతోంది.

ఏడాది కావస్తున్నా పాలనపై అవగాహన ఎంత?

కొత్తగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులకు గ్రామ పాలన, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పర్యవేక్షణపై తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, గ్రామాలవారీగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై అధికారులు దృష్టి సారించాలి. ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని సమస్యలపై నిరంతరం సమీక్షించుకోవాలి.

పనులు పూర్తయ్యాయి.. బిల్లులు ఎప్పుడిస్తారు?

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించాలని సర్పంచులు అధికారులను కోరారు. పనులు పూర్తిచేసినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హమైన వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. చెల్లింపుల్లో జాప్యానికి కారణాలను కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.



మండల సర్వసభ్య సమావేశం కేవలం హాజరు పట్టికలు, నివేదికలకే పరిమితం కాకుండా గ్రామాల సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా మారాలి. సర్పంచుల హాజరు, సమావేశాల్లో భాగస్వామ్యం, ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ, పెండింగ్ బిల్లులపై ఉన్నతాధికారులు సమీక్షించాలి. గ్రామ పాలనలో ప్రజలకు జవాబుదారీతనం కనిపించాలన్నదే ప్రధాన లక్ష్యం కావాలి.

ఈ సమావేశంలో తహసీల్దార్ విజయసాగర్, ప్రత్యేక అధికారి నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ అబిడి రాజిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ తరుణ్, మిషన్ భగీరథ, నీటిపారుదల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కరువు మండలాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.. ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యేక పథకం అమలు చేయాలి

ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నాను జయప్రదం చేయండి: తోట బిక్షపతి





హనుమకొండ/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు మండలాల్లో ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మంగళవారం హనుమకొండ మండలం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ కాలనీలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తోట బిక్షపతి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని పలు మండలాలను పాక్షిక కరువు మండలాలుగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి పూర్తిస్థాయి కరువు మండలాలుగా ప్రకటించాలని, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.కరువు కారణంగా వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోతున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక పథకం ద్వారా పని కల్పించాలని కోరారు. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రతి మండలంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ పద్ధతిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు.దేశంలో, రాష్ట్రంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల సంక్షేమాన్ని విస్మరించడం పాలకుల బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 11న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. రైతాంగ సమస్యలపై జరిగే ఈ పోరాటంలో ప్రజలు, రైతులు, కార్మికులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, పూజారి నరేందర్, మాలోత్ మంగ, తాటికంటి మమత తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో కూరగాయల సంత ప్రారంభం

రైతులకు మార్కెటింగ్ సౌకర్యం.. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించడమే లక్ష్యం







ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త): ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం కూరగాయల సంత మార్కెట్‌ను గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, పాలకవర్గ సభ్యులు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇప్పటివరకు ప్రత్యేక కూరగాయల మార్కెట్ లేకపోవడంతో స్థానిక రైతులు తాము పండించిన కూరగాయలను విక్రయించుకునేందుకు కాజీపేట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రైతులు రవాణా ఖర్చులు, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి స్థానికంగానే విక్రయ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కూరగాయల సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి పంటలకు స్థానికంగానే మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామ ప్రజలకు నాణ్యమైన తాజా కూరగాయలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ మార్కెట్ ఏర్పాటు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కూరగాయల సంత అభివృద్ధికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి.. మొరం.. ఇసుక దందా!

వర్ధన్నపేటలో అక్రమ రవాణా జోరు?

ల్యాబర్తి, కొత్తపల్లి వాగుల నుంచి ఇసుక తరలింపు ఆరోపణలు

ఎస్సారెస్పీ పరిసరాల్లో మట్టి, మొరం తవ్వకాలు.. జేసీబీలు, ట్రాక్టర్లతో రవాణా?

అధికారుల నిఘా ఎక్కడ? సహజ వనరులకు రక్షణ ఏది?



వర్ధన్నపేట/నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట మండలంలో మట్టి, మొరం, ఇసుక తవ్వకాలు, తరలింపుపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మండలంలోని ల్యాబర్తి, కొత్తపల్లి ప్రాంతాల్లో వాగుల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎస్సారెస్పీ కాలువ పరిసర ప్రాంతాలతో పాటు సమీప తండాల పరిధిలో మట్టి, మొరం తవ్వకాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జేసీబీల సహకారంతో మట్టిని తవ్వి టైర్ల వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం.

మండలంలోని డీసీ తండా, ఎస్సారెస్పీ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న తవ్వకాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? అనుమతించిన ప్రదేశాల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా సహజ వనరులను తరలిస్తున్నారా? అన్నది అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలో తేలాల్సి ఉంది.

అధికారుల నిఘా ఏమైంది?

ఇసుక, మట్టి, మొరం తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడం, అనుమతించిన పరిమితులను అతిక్రమించడం, అక్రమంగా రవాణా చేయడం జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

మైనింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలి. జేసీబీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తవ్వకాలు, రవాణాపై విచారణ చేపట్టాలి. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ సహజ సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. వర్ధన్నపేట మండలంలో మట్టి, మొరం, ఇసుక తవ్వకాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారా? అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారా? లేక ఫిర్యాదులు వచ్చినప్పుడే స్పందిస్తారా? అన్నది వేచి చూడాలి.

అండాలసేకరణ అక్రమ దందాపై ఉక్కుపాదం!

27 ఏఆర్టీ కేంద్రాల్లో తనిఖీలు -7 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్, నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ బృందాలు రాష్ట్రంలోని అన్ని ఐవీఎఫ్ కేంద్రా ల్లో తనిఖీలు చేపట్టాయి. రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ (అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ) కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు పూర్తి చేశారు. ఇందులో ఏడు ఆస్పత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలను గుర్తించిన అధికారులు ఆయా ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. మిగిలిన కేంద్రా ల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలువురు మహిళలను గుర్తించగా.. వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసాగుతోంది.కాగా, ఈ వ్యవహారంపై దర్యాప్తులో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని ఈనెల 6న వెళ్లిన రాష్ట్ర అధికారులు.. తెలంగాణలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకుల వివరాలను కోరారు. రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ అధికారులు కూడా హామీ ఇచ్చారు. కాగా, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ)చట్ట-2021కి విరుద్ధంగా మహిళల నుంచి అండాలను సేకరించడం నేరమని వైద్యశాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది. ఆర్థిక ప్రలోభాలకు లోనై అక్రమ వైద్య విధానాలకు మహిళలు బలికావద్దని సూచించింది. మహిళల అక్రమ అండాల సేకరణ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని 20కి పైగా ఫెర్టిలిటీ సెంటర్లకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

బ్రిటీష్ కాలం నాటి మానవ అవశేషాలను భారత్‌కు అప్పగించిన ఆక్స్‌ఫర్డ్ మ్యూజియం!

బ్రిటిష్ కాలంలో ఆక్స్‌ఫర్డ్ మ్యూజియానికి చేరిన నాగాల మానవ అవశేషాలు

తిరిగి అప్పగించేందుకు అంగీకరించిన మ్యూజియం

30 మంది నాగా ప్రతినిధులతో బ్రిటన్‌లో ఒప్పందం

పుర్రెలతో కూడిన ఈ అవశేషాలు 19101940 మధ్య ఆక్స్‌ఫర్డ్‌కు చేరినట్లు అంచనా

ఒకే స్మారక స్థలం వద్ద గౌరవప్రదంగా సమాధి చేయాలని గిరిజన నాయకుల నిర్ణయం



నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

బ్రిటిష్ వలస పాలన సమయంలో భారత్ నుంచి తీసుకెళ్లిన 39 మంది నాగా ప్రజల మానవ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పిట్ రివర్స్ మ్యూజియం సోమవారం వారి వారసులకు అప్పగించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈశాన్య భారతంలోని నాగాలాండ్ నుంచి 30 మంది బ్రిటన్‌కు వెళ్లారు. ఈ అప్పగింత చారిత్రక ఘట్టమని మ్యూజియం డైరెక్టర్ లారా వాన్ బ్రోఖోవెన్ పేర్కొన్నారు. ప్రధానంగా పుర్రెలతో కూడిన ఈ అవశేషాలను నాగాల సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి, ఒకే స్మారక స్థలం వద్ద సమాధి చేయాలని గిరిజన నాయకులు నిర్ణయించారు.

19వ శతాబ్దంలో స్థాపించిన పిట్ రివర్స్ మ్యూజియంలో ప్రపంచంలోనే అతిపెద్ద నాగాల సంస్కృతికి సంబంధించిన వస్తు సేకరణ ఉంది. ఇందులో 6 వేలకు పైగా వస్తువులు ఉన్నాయి. 1910 నుంచి 1940 మధ్య కాలంలో నాగాలాండ్ నుంచి మానవ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్‌కు తీసుకెళ్లారు. మానవ శాస్త్రవేత్తలుగా పనిచేసిన ఇద్దరు బ్రిటిష్ వలస పాలనాధికారులు వీటిలో ఎక్కువ భాగాన్ని సేకరించారు. అప్పట్లో కొన్ని వస్తువులను ప్రజల అంగీకారంతో కాకుండా, సైనిక దండయాత్రల సమయంలో బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు మ్యూజియం వెబ్‌సైట్ పేర్కొంటోంది.

ఈ అవశేషాల అప్పగింత ప్రక్రియ ఆరేళ్లపాటు కొనసాగిందని మ్యూజియం డైరెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ఎన్నో అధికారిక అడ్డంకులను అధిగమించాల్సి వచ్చిందన్నారు. నాగాల ప్రతినిధులు గతేడాది కూడా బ్రిటన్‌ను సందర్శించి ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. అవశేషాల అప్పగింతపై ఇరు పక్షాలు అధికారిక ఒప్పందంపై సంతకాలు చేశాయి.

నాగాల నాయకుడు తెజావో విహిన్యునో మాట్లాడుతూ.. తమ పూర్వీకుల అవశేషాలను గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి సమాధి చేస్తామని చెప్పారు. తమ భూమి నుంచి ఈ అవశేషాలను ఏ పరిస్థితుల్లో తీసుకెళ్లారో చెప్పడం కష్టమని, ఒక వ్యక్తి తన తండ్రి లేదా తాత పుర్రెను మరొకరికి బహుమతిగా ఇచ్చే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. నాగాలు గతంలో శత్రువుల తలలను యుద్ధ విజయానికి గుర్తుగా తీసుకునే ఆచారం పాటించేవారు. గ్రామాల మధ్యలో తమ నాయకుల తలలను కూడా భద్రపరిచేవారని నాగాలాండ్‌కు చెందిన మానవ శాస్త్రవేత్త డాలీ కికోన్ తెలిపారు. తిరిగి అప్పగించిన అవశేషాల్లో ఒకటి గిరిజన నాయకుడిదని ఆమె వెల్లడించారు.

పాశ్చాత్య దేశాల్లోని మ్యూజియంలు వలస పాలన కాలంలో ఇతర దేశాల నుంచి సేకరించిన వస్తువులు, ముఖ్యంగా మానవ అవశేషాల విషయంలో తమ విధానాలను పునఃపరిశీలిస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని సంస్థలు వాటిని మూల సమాజాలకు తిరిగి అప్పగిస్తున్నాయి. పిట్ రివర్స్ మ్యూజియం 2020లో మానవ అవశేషాలను ప్రదర్శన నుంచి తొలగించింది. అయినప్పటికీ మరో 2,700 అవశేషాలు ఇంకా నిల్వ ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికాలోని ఆదివాసీ సమాజాలకు కూడా ఈ మ్యూజియం గతంలో మానవ అవశేషాలను తిరిగి అప్పగించింది.

ఇంటర్నెట్ లేకుండానే వాతావరణ సమాచారం..

హైదరాబాద్ విద్యార్థి అద్భుత ఆవిష్కరణ!

'సమ్మిట్‌సాథి' అనే పరికరాన్ని రూపొందించిన ఆగమ్ జైన్

ఇంటర్నెట్ లేకపోయినా ఉపగ్రహాల నుంచి మేఘాల చిత్రాలను పంపే పరికరం

మారుమూల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు ఇది ఎంతో ఉపయోగకరం

హిమాచల్‌లోని పది గ్రామాలకు ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చే యోచన

వాతావరణ హెచ్చరికలకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టీకరణ



నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

ప్రకృతి ప్రకోపించినప్పుడు కనీసం వాతావరణ సమాచారం కూడా అందని పరిస్థితుల్లో ఉపగ్రహాల సాయంతో ఆ లోటును పూడ్చే ప్రయత్నం చేశాడు హైదరాబాద్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థి ఆగమ్ జైన్. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా వాతావరణ ఉపగ్రహాల నుంచి మేఘాల చిత్రాలను నేరుగా అందుకునే పరికరాన్ని రూపొందించి తన ప్రతిభ చాటుకున్నాడు.

నెట్‌వర్క్ అవసరం లేని పరికరం

ఆగమ్ రూపొందించిన ఈ పరికరానికి 'సమ్మిట్‌సాథి' అని పేరు పెట్టాడు. సాధారణంగా వాతావరణ వివరాలు తెలుసుకోవడానికి ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్‌లపై ఆధారపడాల్సి ఉంటుంది. కానీ హిమాలయాల్లోని మారుమూల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ సేవలకు అంతరాయం కలుగుతుంది. కొన్నిసార్లు రహదారులు దెబ్బతినడంతో పాటు సమాచార వ్యవస్థలు కూడా పనిచేయవు. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మిట్‌సాథి ద్వారా ఉపగ్రహాల నుంచి మేఘాలకు సంబంధించిన చిత్రాలను నేరుగా పొందవచ్చు.

పది గ్రామాలకు మూడు పరికరాలు

హిమాచల్‌ప్రదేశ్‌లోని సెరాజ్ లోయ పరిధిలో పది గ్రామాలకు ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని ప్రాజెక్టు బృందం భావిస్తోంది. ఇందుకోసం మూడు రిసీవర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిని నిర్వహించేందుకు ముగ్గురు స్థానికులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. ఒక్కో పరికరం తయారీకి సుమారు రూ.68 వేలు ఖర్చవుతోంది.

వాతావరణ హెచ్చరికలకు ప్రత్యామ్నాయం కాదు

ఈ పరికరం సామర్థ్యంపై బృందం స్పష్టత ఇచ్చింది. సమ్మిట్‌సాథి ఆకస్మిక భారీ వర్షాలను ముందుగానే అంచనా వేయలేదు. అలాగే ప్రభుత్వ వాతావరణ శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలు, అత్యవసర సమాచారానికి ఇది ప్రత్యామ్నాయం కాదు. ఉపగ్రహ చిత్రాల ద్వారా వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు అదనపు సమాచార వనరుగా మాత్రమే ఇది ఉపయోగపడుతుంది.

ఇతర రంగాల్లోనూ పరిశోధనలు

ఆగమ్ జైన్ ఆసక్తి ఈ ఒక్క ప్రాజెక్టుకే పరిమితం కాలేదు. ఖగోళ శాస్త్రం, పర్యావరణ అధ్యయనాల్లోనూ స్వతంత్రంగా పరిశోధనలు చేస్తున్నాడు. పాఠశాల విద్యను అభ్యసిస్తూనే ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు ఉపయోగపడే పరిష్కారాన్ని రూపొందించడం అతడి ఆలోచనా పరిణతికి నిదర్శనం.

టీబీ చికిత్సలో కొత్త ఆశలు..

క్షయ వ్యాధి చికిత్సలో హైదరాబాద్ సీసీఎంబీ శాస్త్రవేత్తల కీలక ఆవిష్కరణ

నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

క్షయ (టీబీ) వ్యాధి చికిత్సలో సరికొత్త ఆశలు రేకెత్తిస్తూ హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. టీబీకి కారణమయ్యే 'మైకోబ్యాక్టీరియమ్ ట్యూబర్‌క్యులోసిస్' అనే బ్యాక్టీరియాలోని కీలక బలహీనతలను గుర్తించారు. ముఖ్యంగా మందులకు లొంగని మొండి టీబీ (డ్రగ్-రెసిస్టెంట్ టీబీ)ని ఎదుర్కోవడానికి అవసరమైన కొత్త ఔషధాల ఆవిష్కరణకు ఈ పరిశోధన మార్గం సుగమం చేయనుంది.

సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ కుమార్ నందికూరి నేతృత్వంలోని పరిశోధక బృందం, టీబీ బ్యాక్టీరియా మనుగడకు, వ్యాధిని కలుగజేయడానికి అత్యంత కీలకమైన ప్రోటీన్ రవాణా వ్యవస్థపై దృష్టి సారించింది. కంప్యూటేషనల్ మోడలింగ్, ప్రయోగశాల పరీక్షల ద్వారా ఈ వ్యవస్థలోని 92 ముఖ్యమైన భాగాలు, దాదాపు 200 పరమాణు ప్రతిచర్యలను మ్యాపింగ్ చేశారు. వీటిలో సెక్ఏ1 (ఎవషూ1), టాట్ (ఖ్ఞ) అనే రెండు ప్రధాన మార్గాలను లక్ష్యంగా చేసుకున్నారు.



క్రిస్పర్ ఆధారిత జీన్-సైలెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగించి శాస్త్రవేత్తలు ఈ రెండు మార్గాల పనితీరును తగ్గించారు. ఫలితంగా ప్రయోగశాలలోనూ, మానవ రోగనిరోధక కణాలలోనూ బ్యాక్టీరియా పెరుగుదల గణనీయంగా క్షీణించింది. ఈ వ్యవస్థలను దెబ్బతీయడంతో సెక్ఏ1 మార్గం ద్వారా ప్రయాణించే 100కి పైగా ప్రోటీన్లు, టాట్ మార్గంతో సంబంధం ఉన్న 140 ప్రోటీన్ల రవాణా నిలిచిపోయింది. దీంతో బ్యాక్టీరియా కణత్వచం స్థిరత్వం కోల్పోయి, అంతర్గత ప్రోటీన్లు బయటకు లీక్ అవ్వడం ప్రారంభించాయి. ఇది బ్యాక్టీరియా మరణానికి దారితీసింది.

ఈ పరిశోధనలో ప్రియదర్శిని సన్యాల్, జగదీశ్వరి ఉప్పాడ కీలక పాత్ర పోషించారు. చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఫరీదాబాద్‌లోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ ప్రాజెక్టులో సహకరించారు. ఈ పరిశోధన ఫలితాలను ప్రతిష్టాత్మక 'మాలిక్యులర్ అండ్ సెల్యులర్ ప్రోటియోమిక్స్' జర్నల్‌లో ప్రచురించారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2025 నివేదిక ప్రకారం.. ప్రపంచంలోని మొత్తం టీబీ కేసుల్లో దాదాపు నాలుగో వంతు, డ్రగ్-రెసిస్టెంట్ కేసుల్లో మూడో వంతు భారత్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత చికిత్సకు చాలా నెలల పాటు బహుళ యాంటీబయాటిక్స్ వాడాల్సి రావడం, మందులను తట్టుకునే కొత్త స్ట్రెయిన్‌లు పెరగడం సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో సీసీఎంబీ ఆవిష్కరణ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ పరిశోధన ఫలితాలను పూర్తిస్థాయి ఔషధంగా మార్చడానికి మరికొన్ని సంవత్సరాల సమయం పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో తాగునీటి వృథా.. డెయిరీ సంస్థకు రూ.20 వేల జరిమానా



నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

హైదరాబాద్‌లో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో తాగునీటిని ఫ్లోర్ శుభ్రం చేయడానికి వినియోగించినందుకు గాను ప్రముఖ సంస్థ అక్షయకల్ప ఫార్మ్ అండ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.20,000 జరిమానా విధించారు.జూబ్లీహిల్స్ రోడ్ నెం.70లోని జర్నలిస్ట్ కాలనీలో ఉన్న అక్షయకల్ప ప్రాంగణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటిని నేల శుభ్రపరచడానికి వాడుతున్నట్లు గుర్తించి, వెంటనే జరిమానా విధించారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం ఆ సంస్థ మురుగునీటి కనెక్షన్‌ను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి వృథాను అరికట్టేందుకు జలమండలి తనిఖీలను ముమ్మరం చేసింది. తాగునీటిని కేవలం తాగడానికి, వంట అవసరాలకు మాత్రమే వినియోగించాలని నగరవాసులకు, వాణిజ్య సంస్థలకు స్పష్టం చేసింది. ఫ్లోర్ క్లీనింగ్, వాహనాలు కడగడం, తోటపని, నిర్మాణ పనులకు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నుంచి సరఫరా అయ్యే ట్రీటెడ్ వాటర్‌ను వాడుకోవాలని సూచించింది.నగరవ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి వృథా జరుగుతుంటే, దానికి సంబంధించిన ఫొటోలు లేదా వీడియోలతో 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

ఏఐ భయాలు, సీఈఓ ఎఫైర్..

ఎన్విడియా విలువలో రూ.147 లక్షల కోట్ల ఆవిరి



నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

ప్రపంచంలోనే అతిపెద్ద చిప్ తయారీ సంస్థల్లో ఒకటైన ఎన్విడియాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నెల రోజులకు పైగా కాలంలో కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.57 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.147.36 లక్షల కోట్లు) ఆవిరైంది. ఈ మొత్తం భారత్ వార్షిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు మూడో వంతుతో సమానం. చైనా గూఢచర్య ఆరోపణలు, కంపెనీ సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ నెలకొన్న వివాదాలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెట్టుబడుల భవిష్యత్తుపై ఆందోళనలు ఎన్విడియా షేర్లపై ప్రభావం చూపుతున్నాయి.అక్టోబర్‌లో 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో ఎన్విడియా మార్కెట్ విలువ 5.88 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. నవంబర్ 9 నాటికి అది 4.31 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయింది. దీంతో కంపెనీ విలువలో 1.57 లక్షల కోట్ల డాలర్ల మేర కోత పడింది. ఈ నష్టం టెస్లా మొత్తం మార్కెట్ విలువైన 1.49 లక్షల కోట్ల డాలర్లను కూడా మించిపోయింది. నవంబర్ 9న ఎన్విడియా షేరు 178.67 డాలర్ల వద్ద ముగిసింది. 52 వారాల గరిష్ఠ ధర 243.37 డాలర్లతో పోలిస్తే 26 శాతానికి పైగా తగ్గింది. గత వారంలో 14 శాతం, గత నెలలో 22 శాతం క్షీణించింది.

ఏఐ రంగంలో పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగుతాయా? అన్న సందేహాలు, నియంత్రణపరమైన అనిశ్చితి కూడా షేర్ల పతనానికి కారణమవుతున్నాయి. మరోవైపు సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ గూఢచర్య ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ సంస్థ మెగాస్పీడ్‌లో గతంలో పనిచేసిన ఆలిస్ హువాంగ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్లు జెన్సన్ ఉద్యోగుల వద్ద అంగీకరించిన విషయం తెలిసిందే. చైనా నిఘా సంస్థ తరఫున పనిచేస్తున్నారనే అనుమానాలు ఆమెపై ఉన్నట్లు అమెరికా నిఘా వర్గాల రహస్య నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

నవంబర్ 17న వెలువడనున్న త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎన్విడియా 96.2 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఇందులో డేటా సెంటర్ విభాగం వాటా 89 బిలియన్ డాలర్లు. మొత్తం ఆదాయంలో 92 శాతానికి పైగా ఈ విభాగం నుంచే వచ్చింది. మూడో త్రైమాసికంలో 108 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని కంపెనీ అంచనా వేసింది. ఏఐ చిప్‌లకు డిమాండ్ ఎంత బలంగా ఉందో తాజా ఫలితాలు స్పష్టం చేయనున్నాయి. షేరు ధర తగ్గినప్పటికీ వాల్‌స్ట్రీట్ విశ్లేషకులు మాత్రం ఆశాజనకంగానే ఉన్నారు. వచ్చే 12 నెలల్లో షేరు సగటు ధర 327.14 డాలర్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

ఐఓఏ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు..

గర్వంగా ఉందన్న మంత్రి నారా లోకేశ్



నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పీవీ సింధుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు ఎన్నికైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.''రెండు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు సాధించి, బ్యాడ్మింటన్ కోర్టులో నవతరానికి స్ఫూర్తిగా నిలిచిన పీవీ సింధు.. ఇప్పుడు భారత క్రీడారంగంలో కీలక నాయకత్వ బాధ్యతలను చేపట్టడం గర్వకారణం. సింధూ, మీ విజయాలను చూసి ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది'' అని లోకేశ్ తన సందేశంలో కొనియాడారు. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఆమె, ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ విజయవంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కీలక బాధ్యతల్లో సింధు ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. సింధు ఈ నూతన పదవిని చేపట్టడం భారత క్రీడారంగానికి శుభపరిణామమని పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ వైపు మరో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

నవంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్పడిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావంఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

తుపానుగా మారే అవకాశం తక్కువేప్రస్తుత సమాచారం ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఇటీవలే వచ్చిన అర్నబ్, మురసు తుపానుల ప్రభావంతో రాష్ట్రంలో పంటలు, రహదారులు, విద్యుత్ స్తంభాలకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో అధికారులు తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో మరిన్ని తుపానులు లేదా తీవ్ర అల్పపీడనాలు ఏర్పడే పరిస్థితులు లేకపోలేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

యూఏఈపై యువ భారత్ ఘన విజయం

70 పరుగుల తేడాతో గెలుపు.. అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్‌కు అర్హత

ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసకర సెంచరీ..

నాలుగు వికెట్లతో చెలరేగిన ఇషాన్ సూద్



మస్కట్: అండర్-19 ఆసియా కప్-2026లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో మంగళవారం జరిగిన కీలక మ్యాచ్‌లో 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించిన భారత్.. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్ భారీ సెంచరీతో ఆకట్టుకోగా, బౌలర్ ఇషాన్ సూద్ నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. **ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్**టాస్ గెలిచిన యూఏఈ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 168 బంతుల్లో 160 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. మరోవైపు వీకే వినీత్ 69 బంతుల్లో 67 పరుగులతో అర్ధసెంచరీ సాధించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కెప్టెన్ లక్ష్య రాజేశ్ 17 పరుగులు చేయగా, యశ్‌బర్ధన్ చౌహాన్ 17 పరుగులతో రాణించాడు. చివర్లో మోహిత్ ఉల్వా, ఆర్యన్ సవ్సాని నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత్ 300 పరుగుల మార్కును దాటింది. **ఇషాన్ సూద్ బౌలింగ్ దెబ్బ**310 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. వరుసగా వికెట్లు కోల్పోతూ నిర్ణీత ఓవర్లలో 239 పరుగులకే ఆలౌటైంది. యూఏఈ బ్యాటర్ అహ్మద్ 74 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. నూరుల్లా ఆయోబి 39, యాయిన్ రాయ్ 29, అయాన్ 27 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు.భారత బౌలర్ ఇషాన్ సూద్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మోహిత్, మనాల్, కావ్య పటేల్, యశ్‌బర్ధన్, ఆర్యన్, అర్జున్ తలో వికెట్ సాధించారు. భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో యూఏఈ జట్టు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. **సెమీస్‌లో అఫ్గానిస్థాన్‌తో పోరు**ఈ విజయంతో భారత యువ జట్టు అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. బ్యాటింగ్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్ అసాధారణ ప్రదర్శన, బౌలింగ్‌లో ఇషాన్ సూద్ కీలక వికెట్లు భారత విజయానికి ప్రధాన కారణమయ్యాయి. టోర్నీలో టైటిల్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారత జట్టు సెమీఫైనల్‌లో అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. యువ ఆటగాళ్ల సమష్టి ప్రదర్శనతో భారత శిబిరంలో ఉత్సాహం నెలకొంది.

ఢిల్లీ క్యాపిటల్స్‌లో ట్రేడింగ్‌కు బ్రేక్!

- **అక్షర్ పటేల్, ఆశుతోష్ శర్మ జట్టులోనే..**
- **ఐపీఎల్-2027కు ముందు కీలక నిర్ణయం.. కెప్టెన్సీపై ఇంకా ఉత్కంఠ**



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ఆటగాళ్ల బదిలీలపై జరుగుతున్న చర్చలకు ఢిల్లీ క్యాపిటల్స్ తెరదించింది. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, యువ బ్యాటర్ ఆశుతోష్ శర్మలను ఇతర జట్లకు ట్రేడ్ చేసే ఆలోచన లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇప్పటికే తమ ట్రేడింగ్ ప్రక్రియను ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఇకపై ఎలాంటి ఆటగాళ్ల మార్పిడులు చేపట్టబోమని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి.**అక్షర్‌పై చెన్నై ఆసక్తి** గత కొన్ని రోజులుగా అక్షర్ పటేల్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి తీసుకోనున్నట్లు ప్రచారం జరిగింది. అతడి ఆల్‌రౌండ్ నైపుణ్యాలు చెన్నై జట్టుకు ఉపయోగపడతాయని వార్తలు వచ్చాయి. మరోవైపు ఆశుతోష్ శర్మపై గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఆసక్తి చూపినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరినీ వదులుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ సిద్ధంగా లేదని తాజా పరిణామాలతో స్పష్టమైంది.**ఆటతో ఆకట్టుకున్న ఆటగాళ్లు** 2026 ఐపీఎల్ సీజన్‌లో అక్షర్ పటేల్ 14 మ్యాచ్‌ల్లో 173 పరుగులు చేయడంతో పాటు 11 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ జట్టుకు ఉపయోగపడే ఆటగాడిగా గుర్తింపు పొందాడు. మరోవైపు ఆశుతోష్ శర్మ ఎనిమిది మ్యాచ్‌ల్లో 171 పరుగులు సాధించాడు. 181.91 స్ట్రైక్‌రేట్‌తో వేగంగా పరుగులు సాధిస్తూ ఫినిషర్‌గా తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనల నేపథ్యంలో ఇద్దరినీ జట్టులో కొనసాగించాలని ఢిల్లీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వర్షార్పణమైన మూడో వన్డే

- ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు.. 2-0తో భారత్ ఆధిక్యం



హామిల్టన్: భారత్-న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. మంగళవారం హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా జరగాల్సిన ఈ మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. వరుసగా కురిసిన వర్షంతో మైదానం ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని కొనసాగించింది.టాస్ ఆలస్యంగా జరగ్గా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించినప్పటికీ ఆట ప్రారంభానికి మరోసారి అంతరాయం ఏర్పడింది. అంపైర్లు పలుమార్లు మైదానాన్ని పరిశీలించినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో చివరకు మ్యాచ్‌ను రద్దు చేశారు.ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో భారత్ విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో, రెండో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ విధానంలో నాలుగు పరుగుల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్ రద్దు కావడంతో భారత్ సిరీస్ ఓటమి ప్రమాదం నుంచి బయటపడింది.సిరీస్‌లో నాలుగో వన్డే నవంబర్ 13న, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సిరీస్‌ను సమం చేయాలని న్యూజిలాండ్ భావిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది.

ఐపీఎల్‌లో మరో రెండు కొత్త జట్లు!

2028 నుంచి 12 జట్లతో టోర్నీ నిర్వహణకు బీసీసీఐ కసరత్తు

రేసులో పుణె, వడోదర నగరాలు.. ఒక్కో జట్టు విలువ రూ.వేల కోట్లకు పైమాటే!

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ కలిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరింత విస్తరించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. 2028 సీజన్ నుంచి మరో రెండు కొత్త జట్లను ప్రవేశపెట్టి టోర్నీని 12 జట్లకు పెంచాలని యోచిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కొత్త జట్ల కోసం మహారాష్ట్రలోని పుణె, గుజరాత్‌లోని వడోదర నగరాలు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదనపై ఇంకా ప్రాథమిక స్థాయిలోనే చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయం వెలువడాల్సి ఉందని సమాచారం. **పెట్టుబడులకు ఆసక్తి** ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణతో కొత్త జట్ల కొనుగోలుకు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో కొత్త ఫ్రాంచైజీ విలువ ఒక బిలియన్ డాలర్లకు పైగా ఉండవచ్చని అంచనా. యూరప్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు, పశ్చిమాసియా సావరిన్ వెల్త్ ఫండ్లు, భారతీయ వ్యాపార సంస్థలు, అమెరికాకు చెందిన పెట్టుబడిదారులు కొత్త జట్లలో వాటాలు కొనుగోలు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.**పుణెకు గతంలోనూ ఐపీఎల్ అనుబంధం**పుణె నగరానికి ఐపీఎల్‌తో గతంలోనూ అనుబంధం ఉంది. 2011 నుంచి 2013 వరకు పుణె వారియర్స్ ఇండియా జట్టు ఈ నగరానికి ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ జట్టు బరిలోకి దిగింది. 2017లో ఫైనల్‌కు చేరిన ఆ జట్టు ముంబై ఇండియన్స్ చేతిలో ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. దీంతో పుణెలో మళ్లీ ఐపీఎల్ జట్టు ఏర్పాటైతే క్రికెట్ అభిమానులకు మరింత ఉత్సాహం కలగనుంది.**వడోదరకు కొత్త అవకాశం** గుజరాత్‌లోని వడోదర కూడా కొత్త ఐపీఎల్ జట్టు కోసం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే అహ్మదాబాద్ కేంద్రంగా గుజరాత్ టైటాన్స్ జట్టు కొనసాగుతోంది. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వడోదరను మరో క్రికెట్ కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలున్నాయి. ఈ నగరంలో ఐపీఎల్ జట్టు ఏర్పాటైతే గుజరాత్‌లో క్రికెట్‌కు మరింత ప్రాధాన్యత పెరగనుంది.**భారీగా పెరిగిన ఐపీఎల్ జట్ల విలువ** ఇటీవల ఐపీఎల్ జట్ల యాజమాన్య మార్పులు, పెట్టుబడుల ఒప్పందాలు ఫ్రాంచైజీల విలువను భారీగా పెంచాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విలువ 1.78 బిలియన్ డాలర్లుగా, రాజస్థాన్ రాయల్స్ విలువ 1.65 బిలియన్ డాలర్లుగా వార్తల్లో నిలిచాయి. గతంలో 2022 సీజన్‌కు ముందు లక్నో సూపర్‌జెయి ంట్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు ఐపీఎల్‌లోకి ప్రవేశం చాయి.**ప్రసార హక్కులపై కీలక నిర్ణయం**2023 నుంచి 2027 వరకు ఐపీఎల్ ప్రసార హక్కుల ద్వారా బీసీసీఐకి 6.2 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. 2028 నుంచి ప్రారంభమయ్యే తదుపరి ప్రసార హక్కుల కాలంతో కొత్త జట్ల ప్రవేశాన్ని అనుసంధానించే అవకాశం ఉంది. అయితే అదనపు మ్యాచ్‌ల నిర్వహణ, ఆటగాళ్ల అందుబాటు, ప్రసార సంస్థల ఆసక్తి, వాణిజ్యపరమైన అంశాలను బీసీసీఐ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

సాండ్‌పేపర్ వివాదంపై స్టార్క్ స్పందన

ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఘటనపై పాత వైఖరికే కట్టుబడి ఉన్నా

ఖవాజా వ్యాఖ్యలతో మళ్లీ తెరపైకి వచ్చిన బాల్ ట్యాంపరింగ్ వివాదం



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఎనిమిదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాల్ ట్యాంపరింగ్ (సాండ్‌పేపర్) వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సర్వ్'లో చేసిన వ్యాఖ్యలపై ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్పందించాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో బంతి ఆకారాన్ని మార్చేందుకు సాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటనపై తన అభిప్రాయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశాడు.**ఖవాజా సంచలన ఆరోపణలు**2018లో కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతిని ట్యాంపరింగ్ చేయడం ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర కలకలం రేపింది. అప్పట్లో కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఈ ఘటనలో జట్టులోని పలువురికి ముందుగానే విషయం తెలుసని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. కేవలం ముగ్గురిపైనే బాధ్యత మోపడం సరికాదని, జట్టు మొత్తం బాధ్యత వహించాల్సిందని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కేప్‌టౌన్ టెస్టుకు ముందు పోర్ట్ ఎలిజబెత్ టెస్టులోనూ బంతిని ట్యాంపరింగ్ చేశారని ఆరోపించాడు. **నా అభిప్రాయంలో మార్పులేదు: స్టార్క్**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన స్టార్క్.. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఘటనపై తన జ్ఞాపకాలు, అభిప్రాయాలు మారలేదని తెలిపాడు. 2021లో తాము విడుదల చేసిన సంయుక్త ప్రకటనకే కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశాడు. మైదానంలో బంతిని మార్చేందుకు విదేశీ పదార్థాన్ని తీసుకెళ్లిన విషయం తమకు తెలియదని అప్పట్లోనే చెప్పామని గుర్తుచేశాడు. పోర్ట్ ఎలిజబెత్ టెస్టులోనూ ట్యాంపరింగ్ జరిగిందన్న విషయం తనకు ఇప్పుడే తెలిసిందని పేర్కొన్నాడు.**విచారణను మళ్లీ ప్రారంభించం: క్రికెట్ ఆస్ట్రేలియా**మరోవైపు ఈ వివాదంపై మళ్లీ విచారణ చేపట్టే ఉద్దేశం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. ఇప్పటికే విచారణ పూర్తయిందని, ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వల్ల ప్రయోజనం లేదని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ వెల్లడించాడు. అయితే ఖవాజా చేసిన వ్యాఖ్యలకు డేవిడ్ వార్నర్ మద్దతు తెలపడంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఈ వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.ఎనిమిదేళ్ల క్రితం ముగిసినట్లు భావించిన సాండ్‌పేపర్ వివాదం.. తాజా ఆరోపణలతో మళ్లీ ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేస్తోంది.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
బుధవారం 11 నవంబర్ 2026



‘పొలిమేర 3‘ గ్లింప్స్

కొమరయ్య తాంత్రికం.. అర్జున్ సర్జా పవర్ఫుల్ ఎంట్రీ

ఓటీటీలో మా ఊరి పొలిమేర తెచ్చుకున్న రెస్పాన్స్, ఆ తర్వాత థియేటర్లలో పొలిమేర 2 సాధించిన సక్సెస్ తో ఈ ఫ్రాంచైజీకి మంచి క్రేజ్ ఏర్పడింది. తక్కువ బడ్జెట్ తో మొదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టిన ఈ సిరీస్ ఇప్పుడు మరో కథతో సిద్ధమవుతోంది. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని అంతకంటే భారీ స్కేల్ లో సిద్ధం చేస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా పొలిమేర 3 నుంచి వదిలిన స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. 5 వీడియో ప్రారంభంలో ఒక పాత గుడి గోపురం చుట్టూ కాకులు తిరగడం, ఆకాశంలో అమావాస్య సూర్యగ్రహణం కనిపించి మిస్టీరియస్ వైబ్ సెట్ చేశారు. ఆ వెంటనే గాల్లో తేలివచ్చే ఈక, విష్ణువు నుంచి శివుడి రూపానికి మారే మార్ఫింగ్ విజువల్స్ చూపించారు. అనంతరం శేషశయనుడైన అనంత పద్మనాభ స్వామి భారీ విగ్రహం తెరపైకి వస్తుంది. గత రెండు భాగాల్లో కథను నడిపించిన కొమరయ్య పాత్ర ఇందులోనూ కొనసాగుతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఒంటిపై బట్టలు లేకుండా నేలపై ముగ్గుల మధ్య కూర్చుని, పురై ముందు దీపాలు వెలిగించి చేతబడులు చేస్తూ సత్యం రాజేష్ కనిపించిన తీరు పాత సినిమాల ఫ్లేవర్ ను గుర్తుచేసింది. ఈ మూడో పార్ట్ లో కొమరయ్య ఎలాంటి తాంత్రిక పూజలు చేయబోతున్నాడనే దానిపై ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించేలా ఆ షాట్ కుదిరింది ఈ వీడియోలో అసలైన సర్ ప్రైజ్ ఎలిమెంట్ గా నిలిచింది యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ఎంట్రీ. విరావి అనే పవర్ఫుల్ యోధుడు పాత్రలో ఆయనను పరిచయం చేశారు. నుదుటిపై తిరునామం, రక్తపు మరకలు, పిల్లి కళ్లతో పొడవాటి జుట్టుతో ఉన్న ఆయన రగ్గడ్ అవతారం చాలా కొత్తగా ఉంది. చేతిలో కత్తులు పట్టుకుని అడవిలో శవాల గుట్టల మధ్య నడుస్తూ వచ్చే సీన్ అర్జున్ క్యారెక్టర్ డెప్తును క్లియర్ గా చాటిచెప్పింది. టెక్నికల్ పరంగా చూస్తే పొలిమేర ప్రపంచం చాలా పెద్దగా విస్తరించినట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతుంది. కృష్ణ ప్రసాద్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సిద్ధార్థ్ కెమెరా పనితనం గ్లింప్స్ కు మంచి థ్రిల్లింగ్ ఫీల్ తెచ్చాయి. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు ఎక్కడా తగ్గకుండా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

‘అలియాస్ రుక్మిణి’ షూటింగ్ పూర్తి..





నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం ‘అలియాస్ రుక్మిణి‘ షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ముగిసినట్లు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.
ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిస్తుండగా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి ఘంటా నిర్మిస్తున్నారు. “అలియాస్ రుక్మిణి షూటింగ్ పూర్తయింది. మరో 25 రోజుల్లో ఎన్నో చెప్పలేని అందమైన భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని థియేటర్లలో వేడుకగా జరుపుకుందాం“ అని నిర్మాణ సంస్థ పేర్కొంది.దీపావళి పండుగకు ముందు ఈ చిత్రం నుంచి నితిన్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన ‘యంగ్ కృష్ణ‘ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ వీడియోను పంచుకుంటూ, “ప్రతి ప్రేమకథకు ఒక ‘ముందు‘ కథ ఉంటుంది. యంగ్ కృష్ణ.. ఓ కలలు కనే యువకుడు. ఇందులో నన్ను సరికొత్తగా చూస్తారు“ అని నితిన్ పేర్కొన్నారు. రుక్మిణి ఆయన జీవితంలోకి రాకముందు కృష్ణ జీవితం ఎలా ఉండేదో ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ఇందులో రుక్మిణి పాత్రలో ఆఫియా సయ్యద్ కనిపించనున్నారు.గతంలో విడుదలైన ఈ సినిమా టైటిల్ టీజర్ కూడా ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఆ టీజర్‌లో నటుడు నాని, దర్శకుడు మురళీ మధ్య జరిగే కథా చర్చ ఆకట్టుకుంది. కృష్ణ కథ అని చెప్పి, రుక్మిణి రాసిన పుస్తకాలను ప్రస్తావించగా.. కుర్చీలో కూర్చుని నిద్రపోతున్న నితిన్ మేల్కొని “రుక్మిణి నా భార్య“ అని చెప్పే డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కాన్సెప్ట్ విన్న నాని ఎంతో ఇంప్రెస్ అయ్యి, షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామని ఉత్సాహం చూపించడం టీజర్‌లో కనిపించింది.ఈ సినిమాకు ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించగా, విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, రేఖ బొగ్గరపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి రమణ మాధవరం సహ దర్శకత్వం వహించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4న వెండితెరపై ప్రేక్షకులను పలకరించనుంది.

టాలీవుడ్ పై కన్నేసిన మలయాళ బ్యూటీ!



మాలీవుడ్ నుంచి టాలీవుడ్ కి దిగుమతై సత్తా చాటిన భామలెంతో మంది. ముంబై భామల తర్వాత ఆ రేంజ్ లో ఫేమస్ అయింది కేరళ కుట్టీలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. నయనతార, సాయి పల్లవి, నిత్యా మీనన్, మాళవిక మోహనన్, నివేదా థామస్, కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్, సంయుక్తా మీనన్ వంటి భామలు టాలీవుడ్ లో ఎంత ఫేమస్ అయ్యారో తెలిసిందే. తాజాగా ఇదే బాటలోనే మరో మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ టాలీవుడ్ ..కోలీవుడ్ కోటలను కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది.మలయాళంలో -తన్నీర్ మథన్ దినంగల్-, -నేరు-, -సుపర్ శరణ్య- వంటి హిట్ చిత్రాలతో నేచురల్ పెర్ఫార్మర్‌గా పేరు తెచ్చుకున్న అమ్మడు ఇప్పుడు తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై ఫోకస్ పెట్టింది. సొంత ఇండస్ట్రీలో వరుస హిట్లు అందుకోవడంతో పాటు ఫిల్మ్‌ఫేర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న అమ్మడు క్యూట్ లుక్స్ .. నటనతో తెలుగు మేకర్స్ దృష్టిని కూడా ఆకర్షిస్తుంది. హోమ్లీ లుక్‌తో పాటు కథానాయికగా ఏ తరహా పాత్రనైనా పండించగల ప్రతిభ ఉండటంతో టాలీవుడ్ నుంచి సొగసరికి అవకాశాలు తలుపు తడుతున్నాయి. దక్షిణాదిలో మార్కెట్‌ను విస్తరించుకునేందుకు ఇదే సరైన సమయమని భావించిన బ్యూటీ టాలీవుడ్ వైపు వేగంగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే రౌషన్ మేక సరసన -ఛాంపియన్- చిత్రంతో టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అక్కినేని నాగార్జున సమర్పణలో రూపొందుతున్న -ఇట్లు అర్జున- అనే క్రేజీ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. అలాగే -7 జీ రెయిన్ బో కాలనీ 2-లోనూ అమ్మడు ఎంపికైంది. -బృందావన కాలనీ- సినిమాకు సీక్వెల్ గా రూపొందుతున్న చిత్రమిదిఅలాగే మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న -కాకా- చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈసినిమా గనుక హిట్ అయితే అనస్వర పేరు టాలీవుడ్ లో మారు మ్రోగిపోతుంది. దీంతో పాటు హీరోయిన్ గా ఎంపికైన చిత్రాలు సక్సెస్ అయితే టాలీవుడ్ లో అమ్మడి ఇమేజ్ కి తిరుగుండదు. ప్రస్తుతం ఫామ్ లో ఉన్న యంగ్ హీరోలకు కొత్త భామలు అవసరం.

“రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నా”..

పొలిటికల్ ఎంట్రీపై హీరో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు



తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంతో మరో హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఆయన కూడా రాజకీయాల్లోకి వస్తారా? విజయ్ బాటలో నడుస్తారా? అంటూ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ప్రశ్నలకు సూర్య స్వయంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు.చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం ‘సీన్‘ విజయోత్సవ కార్యక్రమంలో సూర్య ఈ విషయంపై మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడం లేదని చెబుతూనే.. రాజకీయాలంటే తనకు ద్వేషం లేదని పేర్కొన్నారు. రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నానని చెప్పారు. ఆ రంగంపై పూర్తిస్థాయి అవగాహన, బాధ్యతల గురించి తెలుసుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టబోనని స్పష్టం చేశారు.
సూర్య రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సాయం చేస్తున్న ఆయన ‘అగరం ఫౌండేషన్’ సేవా కార్యక్రమాలు ఈ చర్చకు కారణమయ్యాయి. సూర్య నటించిన ‘సీన్‘ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. జీతు మాధవన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కామెడీ చిత్రంలో నజ్రియా నజీమ్, మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 6న విడుదలైన ఈ సినిమా తొలి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.116 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సాక్‌నిల్క్ వెల్లడించింది. భారత్‌లో నెట్ వసూళ్లు రూ.62.75 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

ఎల్ఏసీఎంఏ గాలాలో హృతిక్...

అరుదైన ఘనత సాధించిన తొలి భారత నటుడిగా రికార్డ్



బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. లాస్ ఏంజిల్స్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఎల్ఏసీఎంఏ ఆర్ట్ + ఫిల్మ్ గాలాకు హాజరైన తొలి భారతీయ నటుడిగా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 7న జరిగిన ఈ 15వ వార్షికోత్సవ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.
ఈ కార్యక్రమానికి హృతిక్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ ‘బ్రునెల్లో కుసినెల్లి’ డిజైన్ చేసిన డార్క్ బ్లూ టక్సెడోలో హాజరయ్యాడు. రెడ్ కార్పెట్‌పై ఫొటోగ్రాఫర్లకు రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి, భారతీయ సంస్కృతిని చాటాడు. ఈ దృశ్యాలు, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ప్రముఖ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో సహ-చైర్‌గా వ్యవహరించే ఈ గాలా ఆర్ట్, సినిమా రంగాలను ప్రోత్సహించడానికి నిధులు సేకరిస్తుంది. ఈ ఏడాది ఈ వేడుక ద్వారా దాదాపు 70 లక్షల డాలర్లు సమీకరించారు. ఈ ఈవెంట్‌లో హృతిక్‌తో పాటు టామ్ హ్యాంక్స్, కిమ్ కర్దాషియన్, ఆండ్రూ గార్‌ఫీల్డ్, తిమోథీ చలమెట్ వంటి అనేక మంది హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ వేడుకలో హృతిక్‌ను భారత సంతతికి చెందిన నిర్మాత కవితా గుప్తా హోస్ట్ చేశారు. ‘డ్యూన్’ చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెన్యూవ్, నటి నికోల్ కిడ్‌మాన్‌లతో హృతిక్ దిగిన ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక సినిమాల విషయానికొస్తే, ఇటీవల ‘వార్ 2’తో విజయం సాధించిన హృతిక్, త్వరలో ‘క్రిష్ 4’ చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.